
# జారిపోయిన పెన్నిధి



శ్రీమతి
మంత్రవాడి ఇందిర

గట్టిగా వేసిన జడ. జడచివర పిల్లకుప్పెలు. జడలో ముద్ద బంతిపువ్వు చెవులకు జూకాలు కాళ్ళకు గజ్జెల పట్టీలు. లేతనీలంరంగు వెంకటగిరి జరీచీర అదేరంగు జాకెట్టు పచ్చగా. కొంచెం బొద్దుగా తగినంత పొడవుతో పెద్ద పెద్ద కళ్ళతో చకచక తిరుగుతున్న ఆ అమ్మాయిలో నూటికి నూరుపాళ్ళూ తెలుగు దనం వుట్టిపడుతుంది.

'ఎవరే యీ సుబ్బలక్ష్మి?' అప్పుడే నిద్ర లేచిన సూర్యం పక్కింటో అమ్మాయిని పరీక్షగా చూస్తూ అడిగాడు చెల్లెలు సరోజను. సూర్యం వాళ్ళు ఆ యింటోకి అద్దెకుదిగి నాలుగు రోజులు అయింది సూర్యం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు

'ఏమో నాకేం తెలుసు సుబ్బలక్ష్మో, వెంకటలక్ష్మో.. చూస్తుంటే అలాగే వుంది' మూతి తిప్పుతూ అంది సరోజ మాటకు ముందు మూతి తిప్పటం సరోజకు బాగా అలవాటు. ఇంటరు మొదటి ఏడు మూడు సార్లు ప్రయత్నించినా దాటలేక "ఇంక నేను చదవను బాబూ' అంటూ మొండికేసి ఇంటో కూర్చుంది సరోజ అతిగా ఫాషను చేసే సరోజకు తన అందంమీద ఎంతో నమ్మకం ఉదిపిన ఆకాస్త చదువును ఎక్కువగా భావించుకుని తనంతవారు లేరన్నట్లు ప్రవర్తిస్తుంది. పక్కయింట్లో అమ్మాయిని చూడగానే అనుకుంది సరోజ 'అమ్మమ్మలాగవుంది ఈమెతో తనకు స్నేహమేమిటే' అని ఇలా అనుకున్న తర్వాత మరింక ఆమెతోమాట్లాడే ప్రయత్నం చేయలేదు.

సూర్యం నవ్వుకుంటూ బాత్ రూముకేసి నడిచాడు.

మరునాడు సాయంత్రం ఇంటికి వచ్చిన సూర్యానికి చిన్న కబురు ఒకటి చెవిలో వేసింది సరోజ.

"అన్నయ్యా! పప్పులో కాలువేశావు. ఆవిడ పేరు సుబ్బలక్ష్మికాదు. జయశ్రీట" మూతి తిప్పుతూ చెప్పింది

'ప్చ్! మనవాళ్ళకు మనిషికి తగిన పేరు పెట్టటము తెలియదు. సుబ్బలక్ష్మి అయితే చక్కగా సరిపోయేది" నిట్టూర్పు విడిచాడు సూర్యం.

ఆరోజు ఆదివారం. సూర్యం గదిలో కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. పెరటి గోడదగ్గర తల్లి పక్కయింటి ఆమెతో

మాట్లాడటము విన్పించి అనుకోకుండా ఒక చెవి అటు పడేశాడు.

పక్కయింటి ఆమె అంటూంది

'నా జయశ్రీని చూశారుగా వదినగారూ. అదిమా మాటకు అడ్డు చెప్పదు. మంచిరోజు చూసుకుని మాయింటికొకసారి వచ్చి అమ్మాయిని చూడండి. పెళ్లిచూపులంటూ వున్నాయిగా. పిల్లా, పిల్లవాడు ఇష్టపడితే మనదేముంది. చేతనయినంతలో ఏలోటు వెయ్యాము కలిగింది పెడతాము ఏమంటారు?'

"అభ్యంతరాల కేమిటికాని, మావాడు రైల్వేలో వుద్యోగం చేస్తున్నాడు. చదువుకున్న పిల్లకావాలని ముచ్చట పడుతున్నాడు. వాడి ముద్దు ముచ్చటలు కూడా మేము చూడాలికదా మాఇద్దరి అమ్మాయిల పెళ్ళిళ్ళు అంటే ఎలాగో చేశాముకాని సరోజ పెళ్ళి వాడికి వచ్చిన కట్నంతోనే చేయాలి కాబట్టి పిల్లనాకు అన్నివిధాల నచ్చాలి కట్నకానుకలు బాగా ఇవ్వగలగాలి. అయినా మీరు చెప్పారు కాబట్టి యీ ముక్క ఆయన చెవినవేసాను'

"మరి మీ అమ్మాయి ఏమన్నా చదువుకున్నదా?" నిర్మొహమాటంగా అడిగింది ఆవిడ

ఆవిడ తీరు, ధోరణి చూసి తారెల్లిపోయింది. పిల్లతల్లి సీతమ్మగారు చిన్నబోయిన ముఖంతో ఆమె ఏదో అనబోయింది.

'అమ్మా! నాన్న పిలుస్తున్నారు' లోపలనుండి కోపంగా కేకపెట్టింది జయశ్రీ.

'మామాటకు అడ్డు చెప్పదు' అన్నఆమె మాట గుర్తువచ్చి నవ్వుకున్నాడు సూర్యం. రైల్వేలో వుద్యోగం చేస్తున్నవాడు మొగుడవుతాడు అంటే అడ్డుచెప్పేందుకేముంటుంది.

అందులో సుబ్బలక్ష్మి వంటి వాళ్ళకు... సూర్యాని కెందుకో ఆమెను 'జయశ్రీ'గా అనుకోవాలంటే నామోషి. 'పేరులోవున్న అందంకూడా వెదుతుంది'సుబ్బలక్ష్మి అయితేనే అతికినట్లు సరిపోతుంది' అనుకుని మళ్ళీ కాగితాలలో తల దూర్చాడు.

'ఏమిటమ్మా నువ్వు మరీను. నాన్నగారు వాళ్లకు మాట ఇచ్చానంటే కాదనలేక 'సరే' అన్నాను... కాని, ఆవిడ అంత దూకుడుగా మాట్లాడుతుంటే పట్టించుకోకుండా నువ్వు ఏమిటో చెప్పబోతావు దేనికి? అయినా మీరు నా పెళ్ళిని గురించి ఎవరినీ దేవిరించనక్కర లేదు' ఇంట్లోకి వచ్చిన తల్లితో విసురుగా అంది జయశ్రీ.

సీతమ్మగారు కూతురివంక తెల్లబోయి చూసింది.

జయశ్రీ అంత కోపంగా మాట్లాడటానికి తగిన కారణముంది. పక్కయింటివారి వ్యవహారం మొదటి నుండి ఆమెకు నిస్పృహనే వుంది. ముఖ్యంగా ఆ అన్నా చెల్లెలి సంగతి ఏమి బాగుండలేదు. వాళ్ళు తనని చూసి ఎగతాళిగా మాట్లాడుకోవటము... నవ్వుకోవటము ఆమె చూస్తూనే వుంది.

'అమ్మా జయా! నా కళ్లజోడు ఎక్కడ పెట్టావమ్మా' తండ్రి అడగటము విని లేచి వెళ్లింది జయశ్రీ.

సూర్యం తండ్రి కేశవరావుగారు కోపంగా చిందులు వేస్తున్నారు

సూర్యం తండ్రి ఎదుట తలవంచుకుని నిలబడ్డాడు.

'ఆ అమ్మాయి కేమి తక్కువరా. బంగారు బొమ్మలాగ వుంటుంది. పైగా చక్కగా"... ఆయనను వాక్యం పూర్తి చెయ్యనివ్వలేదు.

'నాకిష్టంలేదు నాన్నా' సూర్యం మధ్యలోనే అందుకున్నాడు.

కేశవరావుగారు కొడుకువంక వురిమి చూశారు.

'వాడికిష్టంలేదని చెబుతున్నాడు గదా. దానికి ఇంత హంగామా ఎందుకు. ఇది కాకపోతే ఇంకొకటి. అన్ని విధాల వాడికి నచ్చిన రాజాలాంటి సంబంధం వస్తుంది' సుందరమ్మగారు కొడుకుని వెనకవేసుకు వచ్చింది.

'సరే మీ ఇష్టం వచ్చినట్లు అఘోరించండి. ఆ పెద్దమనిషికి మాటఇచ్చాను. మాట తప్పితే బాగుండదు. రేపు వాళ్ళ ఇంటికి పెళ్ళి చూపులకు వెళ్ళి తీరాలి. తర్వాత ఏమన్నా నిర్ధారించండి' కండువా దులిపి భుజంమీద వేసుకుని బయటకు నడిచారు కేశవరావుగారు.

పెళ్ళి చూపుల తంతు మామూలుగా ముగిసింది. పెద్దవాళ్ళు ఇద్దరూ మాటల్లో పడ్డారు. సూర్యం ముఖం ముడుచుకుని కూర్చున్నాడు. కాఫీ ఫలహారాలుకూడా అయినవి. వాకిటిలో ఎవరో పిలవటము వలన కేశవరావుగారు లేచి 'ఇపుడే వస్తా'నంటూ వెళ్ళారు.

"అమ్మాయి ఏం చదువుకున్నది?" వున్నట్టుండి సూర్యం తల్లి సుందరమ్మగారు ప్రశ్నించింది. సీతమ్మగారు మాటాడలేదు.

జయశ్రీ తండ్రివైపు కళ్ళు పెద్దవి చేసి చూసింది


"అబ్బే... ఏదో..." నసిగారు రామారావుగారు.

సుందరమ్మగారి ముఖంలో రంగులు మారటము జయశ్రీ స్పష్టంగా గమనించింది.

సరోజకూడా వూరుకోలేదు. అడ్డదిడ్డమైన ప్రశ్నలు ఏవో వేసి తన ఆధిక్యతను కూడా నిలపుకుంది.

నాలుగు రోజుల తర్వాత విషయం. కేశవరావుగారు బయటకు బయలుదేరుతుంటే






# జారిపోయిన పెన్నిధి

పక్కింటి వసారాలోవున్న రామారావుగారు చూసి గేటుదగ్గరకు వచ్చారు.

'ఏమి అనుకోకండి కేశవరావుగారు. మా జయశ్రీకి ఏమంత సుముఖంగా లేదు. అమ్మాయిని కాదని నేను ఏమి చెయ్యలేను.' చెప్పలేక చెప్పారు.

'అమ్మయ్య! బ్రతికించారు. నేనూ అదే చెబుదామనుకుంటున్నాను. మావాడు నసేమిరా వద్దంటున్నాడు. అంత వద్దంటుంటే బలవంతంగా మనముకట్టి పడవేయలేము కదా. ఏమిటో... అంతా భగవన్నిర్ణయం... పోనీయండి సాయంత్రం చదరంగం ఆడుకుందుకు వస్తానండోయ్' అంటూ సాగిపోయారు కేశవరావుగారు.

రామారావుగారు నవ్వుకుంటూ కదిలారు.

తర్వాత చెప్పకోతగిన విశేషాలు ఏమి లేకుండానే మూడు నెలలు గడచిపోయాయి.

పక్కయింట్లో సందడి తగ్గినది. అసలు మనుష్యులున్న జాడ కనిపించటములేదు.

'మన పక్కింటి సుబ్బులు ... అదే సుబ్బలక్ష్మి కనిపించుటములేదు ఏమిటే సంగతి' చెల్లెల్ని అడిగాడు ఒకరోజు సూర్యం.

'కుట్లు, అల్లికలూ నేర్చుకుందుకు ఎక్కడకయినా వెళ్ళిందేమో' వ్యంగ్యంగా అంది సరోజ.

"అదేమికాదురా. వాళ్ళందరూ గుంటూరు వెళ్ళారు. అక్కడే ఆ అమ్మాయికి పెళ్ళి నిశ్చయంకూడా చేసుకున్నారుట. పెళ్ళి వాళ్ల తాతగారి ఇంట్లోనే చేస్తారుట. మీ నాన్నగారి పేరుతో నిన్ననే శుభలేఖ కూడా వచ్చింది ఇక్కడే ఎక్కడో పెట్టాను. వుండు చూస్తాను" ఆవిడ వెదకి తీసుకుని వచ్చి ఇచ్చింది. ఆవిడ ముఖంలో సూర్యానికి పెళ్ళి కలిసి రాలేదన్న బాధ తొంగి చూస్తోంది.

సూర్యం, సరోజ ముఖాలు చూసుకున్నారు

'పోస్ట్' పోస్టుమాను కేక పెట్టి ఉత్తరాలు పడవేసి వెళ్ళాడు. సూర్యం తీసుకుని చూశాడు. ఒకటి సూర్యం మేనత్త రాసినది. ఇంకొకటి సూర్యం స్నేహితుడు శ్రీధర్ రాశాడు తనకు పెళ్ళి నిశ్చయమైనదనీ ... శుభలేక పంపుతున్నాను పెళ్ళికి తప్పక రమ్మనీ' సూర్యానికి రాశాడు. శుభలేఖ చూశాడు సూర్యం. పెళ్ళికూతురు పేరు జయశ్రీ. అనుమానం వచ్చి తల్లి ఇచ్చిన శుభలేఖ చూశాడు. పెళ్ళికొడుకు పేరు శ్రీధర్. మిగిలిన వివరాలు కూడా సరిపోయాయి.

నవ్వుకున్నాడు సూర్యం. శ్రీధర్ తనకు కాలేజిలో క్లాస్‌మేటు. తను కాలేజితో చదువుకు గుడ్‌బై కొట్టి వున్న ఒక్క డిగ్రీతో తంటాలు పడి ఎలాగో రైల్వేలో వుద్యోగం సంపాదించాడు. శ్రీధర్ ఇంకో డిగ్రీ కూడా తెచ్చుకుని కాలేజీలో లెక్చరరుగా చేస్తున్నాడు. పార్టు టైము రిసెర్చి చేస్తున్నాడని కూడా ఆ మధ్య ఎవరో అంటే విన్నాడు. అటువంటి వాడు సుబ్బలక్ష్మిని చేసుకుంటున్నాడా అంటే... ఇంతకీ సుబ్బలక్ష్మి అదృష్టవంతురాలు... పూర్ ఫెలో శ్రీధర్" నిట్టూర్పు విడిచాడు.

శ్రీధర్ తనకు ప్రాణస్నేహితుడేమీ కాదు తమ ఇద్దరిమధ్య వున్నది అంతంత మాత్రపు స్నేహమే. పెళ్ళికి తప్పనిసరిగా వెళ్ళాలని ఏమిలేదు. అదీగాక ఇది సుబ్బలక్ష్మి పెళ్ళి ... సూర్యానికెందుకో వెళ్ళాలని అనిపించలేదు. శుభాకాంక్షలు మాత్రం పంపాడు.

తర్వాత ఏడెనిమిది నెలలు ఇట్టే గడచిపోయాయి.

గుంటూరు స్టేట్‌బ్యాంకులో పనిపడి వెళ్ళాడు సూర్యం. 'ఆఫీసరు' అన్న చిన్న బోర్డు గాపి నెమ్మదిగా స్ప్రింగుడోరు తీసుకుని లోపలకు వెళ్ళాడు. అక్కడ సీటులో కూర్చుని తల వంచుకుని చకచక వ్రాసుకుంటున్న ఆమెను 'మేడమ్' అని మర్యాదగా సంబోధించాడు సూర్యం.

'యస్' అంటూ తలెత్తిన ఆమె సూర్యాన్ని చూసి ఆశ్చర్యపోలేదు. పైగా చిన్నగా నవ్వి రాసుకుంటూనే కూర్చోమన్నట్లు చేతితో సైగ చేసింది ఆమె.

సూర్యం కూర్చోలేదు పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు. తల గిర్రున తిరుగుతూంది. ప్రపంచంలో ఎనిమిదో వింత చూస్తున్నట్లు వుంది అతనికి ఇది ఎలా సంభవం... ఎక్కడి సుబ్బలక్ష్మి... ఎక్కడి ఈమె. బంగారు బొమ్మలాగ.. కాదు కాదు.. బంగారు తీగలాగ వున్నది ఈమె. ఇది కలా... నిజమా... వచ్చిన పని మర్చిపోయి పిచ్చిపట్టినట్లు చూస్తున్నాడు సూర్యం.

వ్రాయటము ముగించి కాగితాలు పక్కన పెడుతు నిదానంగా అన్నది ఆమె.

'చూడండి సూర్యగారూ. మీరంత ఆశ్చర్యపోవలసిన పనిలేదు. నేను జయశ్రీని. మీరు అనుకున్నట్లు సుబ్బలక్ష్మిని మాత్రం కాను. ఒకవేళ నిజంగా సుబ్బలక్ష్మినైనా మీరు వూహించుకున్నంత హీనంగా వుండరు. ఆల్‌రైట్. ఇపుడు చెప్పండి. మీరు వచ్చిన పని ఏమిటి?' గంభీరంగ, హుందాగా ప్రశ్నిస్తున్న ఆమెను నిశ్చేష్టుడై గాప్తుండిపోయాడు సూర్యం.